




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 616 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర గురువారం 18 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం




# స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది

కూటమి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయాలన్న పవన్

గిరిజన గ్రామాలకు రహదారి కల్పించే 'అడవి తల్లి బాట'కు అధిక ప్రాధాన్యం

'పల్లె పండుగ 1.0' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం

పంచాయతీరాజ్ సిబ్బంది శిక్షణలో దేశంలోనే ఏపీకి ప్రథమ స్థానం

ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక చేయూత

2

# కాకినాడ జిల్లాలో 4జి సెల్ టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

**- కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి**



కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రైవేట్ పోటీని తట్టుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కాకినాడ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీకి దూరంగా ఉన్న ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ కొత్త 4జి టవర్లు ఏర్పాటు చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం లోక్ సభలో సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ పై జరిగిన చర్చలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఈ అంశాన్ని లేవనెత్తారు. కాకినాడ జిల్లాలో ఏజెన్సీ, తీర ప్రాంతాల్లో చాలాచోట్ల సెల్యూలర్ టవర్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారాని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, గండేపల్లి, పెద్దాపురం రూరల్ ప్రాంతాలు, ఉప్పాడ - కొత్తపల్లి తీర ప్రాంతాల వంటి కీలక ప్రదేశాల్లో 10 కొత్త బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త 4జి టవర్లు ఏర్పాటు కోసం ఇప్పటికే సంబంధిత అధికారులకు వివరాలు అందించడం జరిగిందని, కేంద్రం వెంటనే స్పందించి త్వరితగతిన 4జి టవర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం

**- అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా(ఏడీటీవోఐ)తో పర్యాటక శాఖ ఎంవోయూ**

**- 2026 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో "ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ 2025" నిర్వహణ**

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**




అమరావతి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, డిసెంబర్ 17 : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని దేశీయంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా (ఏడీటీవోఐ) సహకారంతో 2026 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖపట్నం వేదికగా 'ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ 2025' నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. బుధవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ లోని తన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఏడీటీవోఐ ప్రతినిధులతో ఎంవోయూ (అవగాహన ఒప్పందం) కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశీయ పర్యాటక రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుతమైన తీరప్రాంతం, మెరుగైన మౌలిక వసతులు కలిగిన విశాఖ నగరం ఈ జాతీయ స్థాయి ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని కోస్టల్ టూరిజం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, ఎకో-అడ్వెంచర్ టూరిజం, ఏజెన్సీ ప్రాంతాల పర్యాటకాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మార్ట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, డెస్టినేషన్ ప్రమోటర్లు, పర్యాటక రంగ వాటాదారులు, ట్రావెల్ నిపుణులు పాల్గొంటారని తెలిపారు.






# క్రికెటర్ శ్రీ చరణికి రూ. 2.5 కోట్ల చెక్కును అందజేసిన మంత్రి నారా లోకేశ్

**- ప్రపంచకప్ విజేత శ్రీ చరణికి రూ. 2.5 కోట్ల నగదు బహుమతి**




2

# న్యాయం, కరుణ, సమానత్వం సౌభ్రాతృత్వం : ప్రవక్త ముహమ్మద్ సందేశం

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : ప్రవక్త ముహమ్మద్ జీవితం మరియు వ్యక్తిత్వం ప్రతి విశ్వాసి హృదయంలో అపారమైన గౌరవాన్ని కలిగిస్తాయి. సీరత్-ఉన్-నబీ అనేది కేవలం చారిత్రక జీవితచరిత్ర మాత్రమే కాకుండా, ముస్లిం జీవన విధానానికి సమగ్ర మార్గదర్శకత్వాన్ని అందించే విలువైన ఆధారం. ఖురాన్ ప్రవక్తను "ఉత్తమ ఆదర్శం"గా పేర్కొనగా, ఆయన జీవితం ఇస్లామీయ సూత్రాలను ఆచరణలో ఎలా అనుసరించాలో స్పష్టంగా చూపిస్తుంది. సీరత్ ప్రాముఖ్యత దాని ఆచరణాత్మకతలో ఉంది. ప్రవక్త కుటుంబ వ్యక్తిగా, న్యాయమూర్తిగా, నాయకుడిగా, సమాజ మార్గదర్శిగా వివిధ పాత్రల్లో ఆదర్శంగా నిలిచారు. భార్యలతో పరస్పర గౌరవం, పిల్లల పట్ల అనురాగం, వివాదాలలో న్యాయసమ్మత నిర్ణయాలు, ఒప్పందాల పట్ల విశ్వసనీయత వంటి అంశాలు ఆయన జీవితం ద్వారా స్పష్టమవుతాయి. దైవిక విలువలు ప్రాపంచిక జీవితంలో ఎలా అన్వయించవచ్చో ఆయన జీవితం ఒక జీవంత ఖురాన్‌లా నిలుస్తుంది. న్యాయం అంశానికి ప్రవక్త జీవితంలో ప్రత్యేక స్థానం ఉంది. సామాజిక హోదా, వంశం, సంపదకు అతీతంగా న్యాయం చేయాలనే దృఢమైన సంకల్పం ఆయన పాలనలో కనిపిస్తుంది. నేరం చేసినవారిపై ఎలాంటి పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేయాలనే సందేశం నేటి ప్రజాస్వామ్య సమాజాలకు కూడా అత్యంత ప్రాసంగికం. సీరత్ మహిళల గౌరవం, హక్కుల పరిరక్షణను బలంగా ప్రతిపాదిస్తుంది. మహిళల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, వారి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని గౌరవించడం, కుటుంబం మరియు సమాజంలో సముచిత స్థానాన్ని కల్పించడం వంటి అంశాలు ప్రవక్త జీవితం ద్వారా స్పష్టమవుతాయి. చివరి ఉపన్యాసంలో కూడా మహిళలను దయతో, న్యాయంగా చూడాలని ఆయన స్పష్టంగా సూచించారు. కరుణ, సహనం, సహజీవనం ప్రవక్త జీవితానికి మూలస్తంభాలు.




మక్కా విజయ సమయంలో శత్రువులను కూడా క్షమించడం ద్వారా ఆయన అసాధారణమైన దయను చాటారు. మదీనా ఒప్పందం ద్వారా బహుళ మతాల సమాజంలో పరస్పర గౌరవం, భద్రత, మత స్వేచ్ఛకు హామీ ఇచ్చారు. ముస్లిమేతరుల హక్కుల పరిరక్షణపై ఆయన ఆదేశాలు భారతదేశం వంటి బహుళ విశ్వాసాల దేశానికి ప్రత్యేకంగా అనువైనవి. మాతృభూమి పట్ల సహజమైన ప్రేమను కూడా సీరత్ గుర్తు చేస్తుంది. మక్కా పట్ల ప్రవక్త వ్యక్తం చేసిన అనురాగం ఒకరి జన్మభూమి పట్ల ఉండే సహజమైన ప్రేమను ప్రతిబింబిస్తుంది. ఇది విశ్వాసంతో పాటు దేశాభివృద్ధికి దోహదపడే బాధ్యతాయుత పౌరులుగా ఉండాలనే సందేశాన్ని ఇస్తుంది. మొత్తంగా, సీరత్-ఉన్-నబీ నేటి సంక్లిష్ట సమాజంలో ముస్లింలకు మాత్రమే కాకుండా సమస్త మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తుంది. న్యాయం, మహిళల గౌరవం, కరుణ, సహనం, సహజీవనం వంటి విలువలు సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పేందుకు అవసరమైన మూలసూత్రాలుగా నిలుస్తాయి. ఈ పాఠాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమానత్వం, పరస్పర గౌరవంతో కూడిన సమాజ నిర్మాణానికి సీరత్ శాశ్వత ప్రేరణగా కొనసాగుతుంది

# టిడిపి జిల్లా అధ్యక్షుడిగా గుత్తుల సాయి నియామకం ప్రశంసనీయం

**- గుత్తుల సాయి నియమాకం పట్ల పలువురి హర్షం- జిల్లా అధ్యక్షునికి గుబ్బల మూర్తి అభినందనలు**



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా ఎన్నో తర్జన భర్జనల మధ్య పార్టీ శ్రేణుల అభిప్రాయాలు కనుగుణంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గుత్తుల సాయిని నియమించింది. గుత్తుల సాయిని నియమాకం పట్ల పార్టీ శ్రేణులు ప్రశంసిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన గుత్తుల సాయి గతంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం నర్సాపురం నియోజకవర్గం పార్టీ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు. ఈయన పార్టీకి అందించిన నిష్కల్మష సేవలను గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. బీసీ శెట్టిబలిజ వర్గానికి చెందిన గుత్తుల సాయి 1987వ సంవత్సరము నుండి క్రియాశీలక రాజకీయాలలో పాల్గొంటున్నారు. 1996లో సర్పంచ్ గా మొదటిసారి ఎన్నికయ్యారు. సర్పంచిగా ఉంటూనే 2001లో ముమ్మిడివరం మండల ఎంపీపీగా 2006లో జడ్పిటిసిగా చేశారు. 1996 నుండి 2011 వరకు 15 సంవత్సరాలు పాటు వరుసగా పదవుల్లో కొనసాగారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలచే ఎన్నుకోబడి ముమ్మిడివరం నియోజకవర్గంలో శెట్టిబలిజ సామాజికవర్గంలో బలమైన నాయకుడిగా ఎదిగారు. ఆ తదుపరి 2009లో ముమ్మిడివరం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. 2014లో వైయస్సార్సీపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరి అప్పటినుండి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు రాజుకు అండదండలు అందిస్తూ వస్తున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తో అత్యంత సన్నిహితంగా మెలుగుతున్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ తోను సన్నిహిత సంబంధాలు ఉండడంతో పార్టీ అధ్యక్షుడు ఎంపికకు దోహదపడ్డాయి. సీనియర్ నాయకులు, అనుభవజ్ఞులు, సౌమ్యుడు, వివాదారహితుడు అయిన గుత్తుల సాయి నియమాకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి అభినందనలు తెలియజేశారు



# శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : ప్రముఖ దివ్య క్షేత్రం మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి దేవస్థానం ప్రచురించిన 2026 క్యాలెండర్ ను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాలకమండలి సభ్యులతో కలిసి వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామివారి ఆశీస్సులు అందరిమీదా ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును ఆలయానికి ఆహ్వానించి చరిత్రలో నిలిచిపోయేలా బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకునేందుకు తగిన ఆలోచన చేసి ముందుకు వెళదామని గ్రామస్తులతో ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆలయ అధికారులకు, గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో సురేష్, చింతం కృష్ణ, ధరణాల రామకృష్ణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం

రెండు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్ బీ2బీ నెట్‌వర్కింగ్ సెషన్లు, గమ్యస్థానాల ప్రదర్శనలు, వ్యాపార సమావేశాలు, ప్యానెల్ చర్చలు, పర్యాటక ప్రాంతాల సందర్శన కార్యక్రమాల ద్వారా స్థానిక పర్యాటక వాటాదారులకు జాతీయ స్థాయిలో వ్యాపార సంబంధాలు ఏర్పడతాయని తాము భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అపారమైన, వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించడానికి ఇదొక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ చొరవ వల్ల రాష్ట్రానికి పర్యాటకుల రాక పెరగడమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు, దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలు మెరుగుపడతాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ దేశీయ పర్యాటకాన్ని బలోపేతం చేయడం, అంతగా ప్రాచుర్యం లేని పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడం, వెలుగులోకి తీసుకురావడం, స్థానిక వర్గాలకు స్థిరమైన పర్యాటక వృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించడం తమ అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు పర్యాటక శాఖ కూడా బాధ్యతాయుతమైన, సమగ్రమైన పర్యాటక వృద్ధిని సాధించేందుకు జాతీయ సంఘాలతో కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరగనున్న ఈ అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నేషనల్ టూరిజం మార్ట్ 2025 ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోని అత్యంత డైనమిక్, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్న పర్యాటక కేంద్రంగా మార్చడంలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏపీ సృజనాత్మక సంస్కృతి సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, కమ్యూనికేషన్ ఆఫీసర్ పద్మారాణి, అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, వైస్ ప్రెసిడెంట్ ఆశిష్, ట్రావెల్ మార్ట్ సీఈవో విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ 2026 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 :
సబ్ కలెక్టర్ వారి కార్యాలయం విజయవాడలో సబ్ కలెక్టర్ చైతన్య పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ 2026 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చైతన్య మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలా మంచివని, ఈ కార్యక్రమాలు చేసిన కమిటీ సభ్యులను పేరు పేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు శిరీష మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్



క్యాలెండర్ లో మేము చేసిన ఎన్నో సేవా కార్యక్రమాలను ఇందులో పొందుపరిచామని, అన్నదానం కార్యక్రమం, చీరలు, దుప్పట్లు పంపిణీ, గర్భిణీ స్త్రీలకు పోషకాహారం పంపిణీ, అంగనవాడి పిల్లలకు కుర్చీలు పంపిణీ, వృద్ధులకు వికలాంగులకు పండ్లు పంపిణీ, ప్రతి సంవత్సరం ఎండాకాలంలో చెప్పులు పంపిణీ, మూగజీవులకు నీటితొట్టులను ఏర్పాటు చేయడం, పక్షుల కోసం మొక్కలు నాటే కార్యక్రమం చెయ్యటం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ చూడగానే ప్రతి ఒక్కరికి మేము కూడా ఇలాంటి సేవ చేయాలని అలోచన వస్తుందని అన్నారు. వసుధ ఝూన్సి మాట్లాడుతూ సబ్ కలెక్టర్ చైతన్య తమ సంస్థ వారు సన్మానం చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుల పరమేశ్వర రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుల పరమేశ్వర రావు, ట్రస్ట్ సభ్యులు వసుధ ఝూన్సి, లెనిన్, శానంపూడి శిరీష, కె.నరేంద్ర, రత్నం చిట్టిబాబు, రత్నం దుర్గాభవాని మరియు పరమేశ్వర మోటర్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (పి.ఎం.టి.డబ్ల్యు.యు) గౌరవ సభ్యులు వెంకన్న, వసుధ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది


కూటమి ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రిగా ఆయన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన 'పల్లె పండుగ 1.0' పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంపై కలెక్టర్లకు అభినందనలు. ఈ కార్యక్రమం కింద గ్రామాల్లో 4,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, రైతులకు అండగా 22,500 మినీ గోకులాలు, 15,000 నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్‌ను విజయవంతంగా నిర్మించాం" అని తెలిపారు. ఉపాధి హామీ పథకం (నరేగా) ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించి, రూ. 4,330 కోట్ల వేతనాలు చెల్లించామని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనిచ్చిందని వివరించారు. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన 'అడవి తల్లి బాట' కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ అనుమతుల విషయంలో పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల కలెక్టర్లు అద్భుతమైన పనితీరు కనబరిచారని అభినందించారు. ముఖ్యంగా, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ 100 శాతం అనుమతులు సాధించడంపై ప్రశంసలు కురిపించారు. పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే 'రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్' (=+హూ)లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచేందుకు పన్నుల వసూళ్లను డిజిటలైజ్ చేయడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్‌లో ఒక యూనిట్‌తో ప్రారంభమైన 'స్వచ్ఛ రథం' కార్యక్రమం నేడు 25 యూనిట్లకు చేరి సత్ఫలితాలనిస్తోందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్లకు సూచించారు.

# క్రికెటర్ శ్రీ చరణికి రూ. 2.5 కోట్ల చెక్కును అందజేసిన మంత్రి నారా లోకేశ్

మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన యువ క్రికెటర్ శ్రీ చరణికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 2.5 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. ఇవాళ ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా ఆమెకు ఈ చెక్కును అందజేశారు. ఈ నగదు బహుమతితో పాటు విశాఖపట్నంలో 500 గజాల నివాస స్థలాన్ని కూడా ప్రభుత్వం కేటాయించింది. ఆమె డిగ్రీ పూర్తి చేసిన తర్వాత గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇప్పటికే అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కడప జిల్లాకు చెందిన శ్రీ చరణి, ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన ఆమె, ఈ టోర్నీలో మొత్తం 14 వికెట్లు పడగొట్టి సత్తా చాటింది. నవంబర్ 2న జరిగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి భారత మహిళల జట్టు తమ తొలి ఐసీసీ ప్రపంచకప్ టైటిల్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. గత నెలలోనే సీఎం చంద్రబాబు శ్రీ చరణిని అభినందించి, ఈ ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు

# సినీ నటి వాసుకీ (పాకీజా)ను ఆదుకుంటాం : ఎమ్మెల్యే సత్యానందరావు

**- బొబ్బర్లంక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పాకీజాను పరామర్శించి, ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**





కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : తెలుగు సినిమాలలో వెలుగు వెలిగి నేడు దీనస్థితిలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామంలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నటి వాసుకీ (పాకీజా) ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బొబ్బర్లంకలోని ఆశ్రమానికి ఎమ్మెల్యే సత్యానందరావు వెళ్లి ఆమెను పరామర్శించారు. ఒకప్పుడు 60కి పైగా తెలుగు సినిమాల్లో నటించి, తన కామెడీతో ప్రేక్షకులను అలరించిన ఈ మహానటి, నేడు వృద్ధాశ్రమంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వయస్సు, ఆరోగ్య సమస్యలు,ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రస్తుతం తీవ్ర కష్టాల్లో ఉన్నారన్నారు. ఆమె పరిస్థితి తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి కుటుంబం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు అండగా నిలిచారని ఆమె తెలిపారన్నారు. ప్రస్తుతం నటి వాసుకీ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బరలంకలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి, ఇక్కడ జీవించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వయంగా పాకీజా ఉంటున్న వృద్ధాశ్రమానికి వెళ్లి ఆమెను పరామర్శించి, ఈ సందర్భంగా ఆయన కొంత ఆర్థిక సహాయం అందించి, శాలువాతో సత్కరించారు. అలాగే పాకీజాకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహాయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తామని భరోసా ఇచ్చారు.

# తాళ్లరేవులో మహిళా వ్యాపారవేత్తలకు ఉద్యమ ఆధార్ నమోదు







తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలను వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించాలనే కార్యక్రమంలో భాగంగా తాళ్లరేవు మండలం సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ ఆధార్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి ఉత్సాహవంతులైన మహిళ వ్యాపారవేత్తలు పాల్గొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా జిఎండిఏసి కార్యాలయం నుండి ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి రాజేష్ డి.ఆర్.డి.ఏ నుండి విజయలక్ష్మి పాల్గొన్నారు. సుమారు 75 మంది మహిళ వ్యాపారవేత్తలకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వెలుగు మండల సమాఖ్య అధికారి కార్యాలయ సిబ్బంది వివిధ గ్రామాల మహిళలు, వివిఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధి ధ్యేయంగా వారికి ఆర్థిక స్వావలంబన కల్పించుటకు ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని, ఉత్సాహవంతులైన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు



# జగ్గంపేట రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్స్ డే నిర్వహణ

**- హాజరైన ప్రముఖులు, 75 సంవత్సరాలు పైబడిన పెన్షనర్స్ కు ఘన సన్మానం**

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 :

స్థానిక గోకవరం రోడ్డులో గల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవనము నందు అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ అధ్యక్షతన పెన్షనర్స్ డే ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.ఆర్.కె.శ్రీనివాస్, ఎమ్మార్వో రమేష్, ఎండిఓ చంద్రశేఖర్, జగ్గంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ డాక్టర్ ప్రణీత్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఎస్బిఐ మేనేజర్ నవీన్ కుమార్, ఉప ఖజానా సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్.వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఎమ్మార్వో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెన్షన్ రావడానికి ముఖ్య వ్యక్తి డీఎస్ నకారా అని ఆయన పెన్షనర్స్కు చేసిన సేవలను కొనియాడారు. ఎంతో వ్యయ ప్రయాసలతో సుప్రీంకోర్టులో కేసు వేసి వాదించారు. నాటి చీఫ్ జస్టిస్ వై.వి చంద్రచూడు పెన్షన్ బిక్ష కాదు హక్కు అని చారిత్రక మైన తీర్పు ఇచ్చారని, ఆనాటి నుండి నేటి వరకు పెన్షనర్లకు వెలుగు నింపిన మహానుభావులను స్మరించుకోవడం సాంప్రదాయక వస్తుందని తెలిపారు. మరొక ముఖ్య అతిథి సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.ఆర్.కె.శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్బిఐ సీనియర్ మేనేజర్ నవీన్ కుమార్, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ ప్రణీత్, మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ట్రెజరీ అధికారి సి.హెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెన్షనర్లకు ఎప్పుడు ఏ విధమైన సహాయ సహకారాలను కోరిన అందిస్తామని, మా వద్దకు నేరుగా వచ్చి కలవాలని తప్పనిసరిగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో 75 సంవత్సరాలు నిండిన సీనియర్ పెన్షనర్స్ సి.హెచ్.సత్యనారాయణ, జి.పాపారాజు, తమటం నాగేశ్వరరావు, సి.హెచ్.సుబ్రమణ్యం, సి.హెచ్.నారాయణ శర్మ, సి.హెచ్.జోసెఫ్ లను ఆహుతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మల్లేశ్వర రావు మాట్లాడుతూ పెన్షనర్ రోజున పండగ జరుపుకుంటున్నామంటే అది నకారా వై.వి.చంద్ర శూడ్ విశేషమైన కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళివెంకట శాస్త్రి, కోన బాబు, హెచ్.వి.ఆర్.జోషి, రెడ్డి సుబ్బారాయుడు, ఇళ్ళ బుద్ధాజీ వెంకటేశ్వరరావు, సి.హెచ్.సూర్యప్రకాశరావు, పడాల వీర వెంకట సత్యనారాయణ, ఉమామహేశ్వరి, జే.ఈ.ఎం.కుమారి, ఐసిడిఎస్ అధికారి తదితరులు పాల్గొన్నారు.






# సెన్సార్ సన్నాహాల్లో రాజేంద్రప్రసాద్ “నేనెవరు?”





హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 17 : నట కిరీటి డా.రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్ర పోషించిన హార్ట్ టచ్చింగ్ చిత్రం “నేనెవరు?”. “నువ్వే కావాలి, ప్రేమించు” చిత్రాల ఫేమ్ సాయి కిరణ్, జోగిని శ్యామల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో జై చిరంజీవ ఫిల్మ్ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు - సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించారు. వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్ - సాయి చెర్రీ హీరోలుగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో దీపిక, సోనాక్షి హీరోయిన్లు. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. తన కెరీర్ లో చాలా గర్వంగా చెప్పుకునే చిత్రాల జాబితాలో “నేనెవరు?” నిలుస్తుందని ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుకలో రాజేంద్రప్రసాద్ ప్రకటించిన నేపథ్యంలో ఈ చిత్రానికి బిజినెస్ పరంగా క్రేజ్ పెరిగిందని, విడుదల తేది త్వరలో ప్రకటిస్తామని నిర్మాతల్లో ఒకరైన భూలక్ష్మి తెలిపారు. ఈ చిత్రానికి పి.ఆర్.ఓ : ధీరజ్-అప్పాజీ, మాటలు : శ్రీనివాస్ అంగిరెడ్డి, పాటలు : ఎస్.ఎస్.వీరు, కొరియోగ్రఫీ : అజయ్ క్రిష్ - సంతోష్, సంగీతం : చిన్నికృష్ణ, ఛాయాగ్రహణం : నాయుడు ప్రసాద్ కొల్లి, ఎడిటింగ్ : నందమూరి హరి - నందమూరి తారకరామారావు.







# యువదర్శకుడు కెకె కన్నుమూత

టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. యువ దర్శకుడు కిరణ్ కుమార్ (కేకే) బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కిరణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కేజేక్యూ: కింగ్.. జాకీ.. క్వీన్' చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. తన కలల ప్రాజెక్ట్ థియేటర్లలోకి రావడానికి ముందే దర్శకుడు మరణించడం చిత్ర బృందాన్ని మరియు అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కిరణ్ కుమార్ 2010లో కింగ్ నాగార్జున హీరోగా తెరకెక్కిన 'కేడి' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ సినిమా అప్పట్లో స్టైలిష్ మేకింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. నాగార్జున లాంటి పెద్ద హీరో తనకు అవకాశం ఇవ్వడం వల్లే తాను దర్శకుడిగా ఎదగగలిగానని కిరణ్ కుమార్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉండేవారు. ఇండస్ట్రీలో ఆయనను అందరూ 'కేకే' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. కాగా.. కిరణ్ కుమార్ మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రతిభావంతుడైన దర్శకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

# మరో హిందీ మూవీలో తమన్నా



తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com